
# పొత్తు పొడుస్తుందా..!!



### బీజేపీ, టీడీపీ క్యాడర్‌లో అయోమయం

- టికెట్ దక్కుతుందో.. లేదోనని ఆశావహుల్లో టెన్షన్
- పొత్తు కుదిరితే ఆశలు గల్లంతేనా?
- గ్రేటర్ బీజేపీ ఆశావహుల్లో టెన్షన్ టెన్షన్
- ప్రచారంలో దూకుడు పెంచిన బీఆర్ఎస్.. బీజేపీలో వణుకు
- పొత్తుపై సర్వే చేయిస్తున్న కాషాయం పార్టీ
- క్యాడర్ ఆగ్రహం.. డిపాజిట్లు దక్కవని హెచ్చరిక
- ఇప్పటికే కుత్బుల్లాపూర్, సికింద్రాబాద్, జూబ్లీహిల్స్, కూకట్‌పల్లిలో బీజేపీ, టీడీపీ ఆశావహుల ప్రచారం
- పొత్తు కుదిరితే ఆ స్థానాల్లో ఒక్కరికి తప్పని త్యాగం

సిటీబ్యూరో, అక్టోబర్ 17(నమస్తే తెలంగాణ) : అభ్యర్థులను ఖరారు చేయడం కాషాయానికి సవాల్‌గా మారింది. ఓ వైపు అధికార బీఆర్ఎస్ పార్టీ నిత్యం ప్రజల్లో అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రచారం చేస్తుంటే.. జనం నుంచి విశేష స్పందన వస్తున్నది. ఇక గులాబీ గెలుపు ఖాయమనే భావనలో బీజేపీ ఉన్నది. అందుకే ఏ అభ్యర్థిని రంగంలోకి దింపాలనే ఆలోచనకు రాలేకపోతున్నారు. మరోవైపు టీడీపీతో పొత్తు ఉంటుందా? అనే కోణంలోనూ కాషాయ పెద్దలు పునరాలోచనలో పడ్డారంటూ వార్తలు వినిపిస్తున్నాయి. పొత్తు కుదిరితే అభ్యర్థుల ప్రకటనలో పునరాలోచించాల్సి ఉంటుందని భావిస్తున్నట్టు సమాచారం. అందుకే పొత్తు అంశం కొలిక్కి వచ్చాకనే బీజేపీ అభ్యర్థుల జాబితా విడుదలయ్యేట్టు కనిపిస్తున్నది. దీంతో ఆశావహుల్లో టెన్షన్ నెలకొన్నది.

### పొత్తు వార్తలతో క్యాడర్ అయోమయం..!!

అధికార పార్టీ ఇప్పటికే టికెట్లు ఖారారు చేసి ప్రచారంలో దూసుకెళ్తుండగా.. కాంగ్రెస్ పార్టీ మాత్రం గ్రేటర్‌లో 14 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. కానీ ఇంకా బీజేపీ టికెట్లు ఎవరికి ఇవ్వాలో కూడా నిర్ణయించుకోకపోవడంతో ఆ పార్టీ నాయకులు అధిష్ఠానంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాదు ఇటీవల అమిత్ షాతో నారా లోకేశ్ భేటీ కావడం కూడా పొత్తు అంశంపైనే అని నాయకులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే తెలంగాణలో టికెట్ ఖరారులో తెలుగుదేశం పార్టీ కసరత్తు చేస్తున్నది. పొత్తు కుదిరితే అటు బీజేపీ.. ఇటు టీడీపీ అనుకున్న స్థానాల్లో అభ్యర్థుల మార్పు ఉండబోతున్నది. ఇప్పటికే నగరంలోని కుత్బుల్లాపూర్ నుంచి టీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ పోటీలో ఉండాలని భావిస్తున్నారు. ఇదే నియోజకవర్గం నుంచి బీజేపీ తరపున కూన శ్రీశైలం గౌడ్ బరిలో ఉండబోతున్నాడని తెలిసింది. అలాగే సికింద్రాబాద్, జూబ్లీహిల్స్, కూకట్‌పల్లి, శేరిలింగపల్లిలోనూ ఆశావాహులు ఎవరికే వారే ప్రచారం చేసుకుంటున్నారు. పొత్తు కుదిరితే సంబంధిత స్థానాలను ఏదో ఒక్క పార్టీ వదులుకోవాల్సి ఉంటుందని నాయకులు చెబుతున్నారు.

### పొత్తు..చిచ్చు..!!

కమలం, టీడీపీ పెద్దలు పొత్తుకు ఉవ్విళ్లూరుతున్నట్టు కనిపిస్తున్నప్పటికీ.. ఆ పార్టీల క్యాడర్ మాత్రం పొత్తును అంగీకరించడంలేదు. ఒంటరిగా బరిలోకి దిగితేనే మేలు జరిగే అవకాశాలు ఉంటాయని ఆయా పార్టీల ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు చెబుతున్నారు. అందులో భాగంగానే కమలం పెద్దలు పొత్తుపై తీవ్రంగా చర్చలు జరుపుతున్నట్టు సమాచారం. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల లిస్టును పక్కన పెట్టి మరోసారి సర్వే చేయిస్తున్నట్టు తెలుస్తున్నది. ఆ సర్వే ఫైనల్ అయ్యాక సీట్లను ఖరారు చేస్తారని, ఇప్పటికే కొత్తవారికి టికెట్లు కేటాయించొద్దంటూ ఆశావహులు అధినాయకత్వానికి లేఖలు రాసినట్టు సమాచారం.

# ఎన్నికల్లో సెక్టోరియల్ అధికారులదే ప్రముఖపాత్ర

### మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్



సమావేశంలో మాట్లాడుతున్న మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్

మేడ్చల్ కలెక్టరేట్, అక్టోబర్ 17 : శాసనసభ ఎన్నికల్లో సెక్టోరియల్ అధికారులు ప్రముఖప్రాత పోషించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సెక్టోరియల్ అధికారులుతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు చెందిన సెక్టోరియల్ అధికారులతోపాటు ప్రతి నియోజకవర్గానికి చెందిన పది మంది చొప్పున మాస్టర్ ట్రైనర్లను ఎంపిక చేసి ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు ఎన్నికల విధులపై శిక్షణ ఇచ్చామన్నారు. అనంతరం ఈవీఎంలపై అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి కేశురామ్, జిల్లా సంక్షేమ అధికారి కృష్ణారెడ్డి, జడ్పీ సీఈఓ దేవసహాయం, జిల్లా స్థాయి ఎన్నికల శిక్షకులు తిరుమలేశ్ తదితరులు పాల్గొన్నారు.

### ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ పేర్కొన్నారు. కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని 16 విభాగాలకు ప్రత్యేకంగా 22 మంది నోడల్ అధికారులను నియమించినట్లు తెలిపారు. ఫిర్యాదులను పరిష్కరించేందుకు సర్వేలైన్స్, ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో సర్వేలైన్స్ బృందాలను, ఎంసీఎంసీ కమిటీ, ఇతర కమిటీలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రజలు 1950 టోల్ ఫ్రీ నంబర్, సీ-విజల్ యాప్ ద్వారా ఫిర్యాదులను చేయవచ్చన్నారు. శాంతిభద్రతలకు ఇబ్బందులు కలుగకుండా అనుమతులు పారదర్శకంగా జారీ చేస్తారని వివరించారు.

## పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి

బాలానగర్, అక్టోబర్ 17 : మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ పేర్కొన్నారు. మంగళవారం కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని జేఎన్‌టీయూలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రం, రిసెప్షన్, టెంపరరీ స్ట్రాంగ్ రూం, రిటర్నింగ్ అధికారి కార్యాలయంతోపాటు నియోజకవర్గం పరిధిలోని కేపీహెచ్‌బీవార్డు కార్యాలయం, పలు ప్రభుత్వ పాఠశాలలు, పలు పోలింగ్ కేంద్రాలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర శాసనసభ ఎన్నికల సందర్భంగా ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారి శ్యామ్‌ప్రకాశ్, ఈఆర్వో రమేశ్, ఏఈఆర్వోలు, ఆయా శాఖల అధికారులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

# సీఎం కేసీఆర్‌కు హ్యాట్రిక్ విజయం ఖాయం

### ఎంబీసీ చైర్మర్ నందికంటి శ్రీధర్

నేరేడ్‌మెట్, అక్టోబర్ 17: ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై అనేక మంది గులాబీ పార్టీలో చేరుతున్నారని ఎంబీసీ చైర్మన్ నందికంటి శ్రీధర్ అన్నారు. గౌతంనగర్ డివిజన్‌కు చెందిన వివిధ పార్టీల నాయకులు మంగళవారం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు మేకల రాము యాదవ్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి ఎంబీసీ చైర్మన్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గడపగడపకు సంక్షేమ పథకాల ఫలాలు అందుతున్నాయన్నారు. పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం ఉంటుందన్నారు. ముచ్చటగా మూడోసారి బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గౌతంనగర్ డివిజన్‌లో ఇతర పార్టీల నాయకులకు కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎంబీసీ చైర్మన్ నందికంటి శ్రీధర్

## తీవ్ర మనోవేదనకు గురై.. కండక్టర్ ఆత్మహత్య

మన్సూరాబాద్, అక్టోబర్ 17: సస్పెన్షన్‌కు గురైన ఓ మహిళా కండక్టర్ మనస్తాపానికి గురై అధిక మొత్తంలో బీపీ గోలీలు వేసుకుని అపస్మారక స్థితికి చేరుకోగా ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. ఈ ఘటన ఎల్బీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మన్సూరాబాద్‌కు చెందిన గంజి శ్రీవిద్య(48) ఆర్టీసీ కండక్టర్. ఈ నెల 12న ఆమెను సస్పెండ్ చేస్తూ ఉత్వర్వులు జారీ అయ్యాయి. సస్పెన్షన్‌తో ఆమె తీవ్ర మనోవేదనకు గురై అధిక మొత్తంలో బీపీ మాత్రలను మింగి.. అపస్మారక స్థితిలోకి వెళ్లింది. కుటుంబసభ్యు లు చికిత్స నిమిత్తం ఎల్బీనగర్ కామినేని దవాఖానలో చేర్పించగా, చికిత్స పొందుతూ ఆమె సోమవారం మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



### బీఆర్ఎస్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ల చేరిక

బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై యాదగిరినగర్, వీడియో గల్లీ ప్రాంతాల్లోని 10 మంది సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు మాగంటి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాల వివరాలు తెలిపే కరపత్రాలను ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ స్థానికులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు రామకృష్ణ, చిన్న రమేశ్, వేణు, సత్య, శ్యామ్‌రావు, బంటి యాదవ్ తదితరులు పాల్గొన్నారు. *– వెంగళరావునగర్, అక్టోబర్ 17*

## 'అరుంధతి'లో వైద్య సేవలు అమోఘం

### వరల్డ్ బాక్సింగ్ చాంపియన్ నిఖత్ జరీన్



మర్రి అరుంధతి వైద్యశాల ప్రాంగణంలో వైద్యులు, విద్యార్థులతో నిఖత్ జరీన్, మర్రి లక్ష్మణ్ రెడ్డి

దుండిగల్, అక్టోబర్ 17 : తల్లికి ఇచ్చిన మాట ప్రకారం బీఆర్ఎస్ పార్టీ మల్కాజిగిరి పార్లమెంటరీ స్థానం, కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గం ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డి అరుంధతి వైద్యశాలను ఏర్పాటు చేసి పేద ప్రజలకు ఉచితంగా నాణ్యమైన వైద్యం అందించడం అభినందనీయమని, ఆసియా క్రీడల కాంస్య పతక విజేత, వరల్డ్ బాక్సింగ్ చాంపియన్ నిఖత్ జరీన్ అన్నారు. దుండిగల్‌లోని మర్రి అరుంధతి మల్టీస్పెషాలిటీ వైద్యశాలను మంగళవారం నిఖత్‌జరీన్ సందర్శించారు. ఈ సందర్భంగా వైద్యశాలలోని వివిధ వార్డులను పరిశీలించిన ఆమె అక్కడ ఉన్న రోగులతో మాట్లాడారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. తల్లికి ఇచ్చిన మాట ప్రకారం మల్టీ స్పెషాలిటీ వైద్యశాలను ఏర్పాటు చేయడమే కాకుండా అందులో చేరే రోగుల వద్ద నయాపైసా తీసుకోకుండా ఉచితంగా వైద్యసేవలు అందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంఎల్ఆర్ఐటీ విద్యా సంస్థల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్నికల ప్రవర్తనా నియమావళిలో రూ.83.69 లక్షల నగదు సీజ్

సిటీబ్యూరో, అక్టోబర్ 17(నమస్తే తెలంగాణ) : ఎన్నికల ప్రవర్తనా నియమావళిలో భాగంగా ఫ్లయింగ్ స్క్వాడ్ ద్వారా మంగళవారం రూ.1,35,8,350 నగదును సీజ్ చేయగా, ఇప్పటివరకు 83,69,900 నగదును సీజ్ చేసినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. పోలీసు అథారిటీ ద్వారా 50,88,779 సీజ్ చేయగా.. ఇప్పటివరకు 19,41,34,682 నగదును సీజ్ చేసినట్లు చెప్పారు. ఎఫ్ఐఆర్‌లు 23 నమోదు కాగా, ఇప్పటి వరకు 156 నమోదు చేయడం జరిగిందన్నారు. లా అండ్ ఆర్డర్ కింద లైసెన్స్ ఆయుధాలను మంగళవారం 1,048 సేకరించగా.. ఇప్పటి వరకు 3,437 ఆయుధాలను సేకరించడం జరిగిందన్నారు. సీఆర్‌పీఎఫ్ 195 కేసులు నమోదయ్యాయని తెలిపారు. 543 బైండోవర్ , 383 నక్కాస్ ఆపరేషన్స్ చేయడం జరిగిందన్నారు. నాన్ బెయిలబుల్ వారంట్ కింద 269 కేసులు నమోదయ్యాయన్నారు. ఎక్సైజ్ శాఖ ద్వారా ఇప్పటి వరకు 2818.43 లిక్కర్‌ను సీజ్ చేశామన్నారు. ప్రొహిబిషన్ 151 కేసులు నమోదు కాగా, 138 మందిని అరెస్ట్ చేసినట్లు అధికారులు తెలిపారు.

## తాను మరణించి.. ఆరుగురికి జీవితాన్నిచ్చాడు..



కాగితోజు హరికృష్ణ (ఫైల్)

ఖైరతాబాద్, అక్టోబర్ 17 : తాను మరణించినా మరో ఆరుగురికి వెలుగులుచ్చాడు. అంబర్‌పేట పటేల్‌నగర్‌కు చెందిన కాగితోజు హరికృష్ణ(38) ప్రైవేట్ ఉద్యోగి. ఈనెల 9వ తేదీన ఇంట్లో ఒక్కసారిగా అపస్మారక స్థితిలో పడిపోయాడు. కుటుంబ సభ్యులు స్థానికంగా ఉన్న ఓ ఆస్పత్రిలో చేర్పించగా.. ఫలితంలేకపోవడంతో మెరుగైన చికిత్స కోసం సోమాజిగూడలోని యశోద దవాఖానలో చేర్పించారు. చికిత్స అందిస్తున్న వైద్యులు ఈనెల 16న బ్రెయిన్‌డెడ్‌గా నిర్ధారించారు. కుటుంబసభ్యులను కలిసిన జీవన్‌దాన్ ప్రతినిధులు అవయవదానం విశిష్టతను వివరించగా.. అందుకు అంగీకరించారు. హరికృష్ణ శరీరం నుంచి కాలేయం, మూత్రపిండాలు, గుండె, కండ్లను సేకరించారు. అవయదానానికి ముందుకు వచ్చిన కుటుంబసభ్యులను జీవన్‌దాన్ అభినందించింది.